క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఊట్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు డీకే నర్సింహా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 12న మహబూబ్‌నగర్‌లో ఎస్సీ వర్గీకరణపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ హాజరవుతారని వివరించారు. సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు తెలంగాణ రన్

మాగనూర్(మక్తల్): రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మక్తల్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం 'తెలంగాణ రన్' నిర్వహిస్తునట్లు సీఐ సీతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ ట్యాంక్‌బండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఉదయం 6 గంటలకు రన్‌ను ప్రారంభిస్తారని వివరించారు. పీఈటీలు, క్రీడాకారులు, అధికారులు క్రీడాభిమానులు, యువతీ, యువకులు, తదితరులు పాల్గొని తెలంగాణ పరుగును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అసత్య ఆరోపణలు సరికాదు

నర్వ: తనపై కొందరు కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. ఇటీవల సొసైటీలో ఏర్పడిన అవకతవకలపై, డైరెక్టర్ల అవిశ్వాస తీర్మాన విషయాలు వెల్లడిస్తానని వివరించారు.

ఆర్టీసీ వీబీఓగా మహదేవప్ప



ఊట్కూరు: ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్‌గా కండక్టర్ మహదేవప్పను నియమించినట్లు ఆదివారం డిపో మేనేజర్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీబీఓ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కావెంజర్లను నియమించాలి

నారాయణపేట రూరల్: పారిశుద్ధ్య సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు స్కావెంజర్లను నియమించాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరారు. హెచ్‌ఎంలపై పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్స్ అందించాలని టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో వలంటీర్లను నియమించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



ధన్వాడ: మండల కేంద్రంలోని సునంద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్‌శెట్టి, దీపికా శెట్టి దాదాపు 300 మందిని పరీక్షించారు. కీళ్ల, మెడ, నడుము నొప్పి ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రయ్య, రమేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా పాఠశాలలు

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో తరగతి గదులు శుభ్రతకు నోచుకోవడం లేదు. బడిబాట కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలను గుర్తించాలని నిత్యం పట్టణంలో విద్యార్థుల తల్లితండ్రులను కలుస్తున్నారు. ఆయా పాఠశాలలో స్వీపర్లు లేకపోవడం, మధ్యాహ్న భోజన కార్మికులకు అందిస్తున్న పారితోషికం అందించలేక పోవడంతో తరగతి గదుల శుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీఉన్నత పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాల తరగతి గదులు అపరిశుభ్రతకు ఆనవాలుగా మారాయి.

జాతీయ రహదారి వెంట నిర్మాణాల తొలగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్–రాయచూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167) వెడల్పులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎనుగొండలో ఆదివారం నాలుగు ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తొలగించారు. వాస్తవానికి వెడల్పు పనులు రెండేళ్ల క్రితమే చేపట్టినా వీటిని అప్పట్లో అలాగే వదిలేశారు. ఇటీవలే బాధితులకు వేరేచోట పట్టాలతో పాటు పరిహారం చెల్లించడంతో ఇప్పుడు పూర్తి చేశారు. కాగా బాధితులెవరూ అడ్డుకోలేదని ఈ పనులు సాఫీగా జరుగుతున్నాయని టీపీఓలు లక్ష్మీపతి, శ్రీకాంత్ తెలిపారు.

వంతెన లేక పాట్లు

- రాకపోకలకు అంతరాయం
- 12 ఏళ్లుగా తప్పని తిప్పలు

మాగనూర్: తళంకేరి– నెరగండొడ్డి గ్రామాల మధ్యలోని వాగుపై గతంలో లోలెవల్ వంతెన నిర్మించారు. నాసిరకంగా నిర్మించడంతో రెండేళ్ల లోపే వచ్చిన వరదతో కొట్టుకుపోయింది. ప్రస్తుతం 12 ఏళ్ల కావొస్తున్నా నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికీ తళంకేరి గ్రామస్తులను వాగు తిప్పలు తప్పడం లేదు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వైయడెక్టర్ నుంచి నిత్యం వాగులోకి నీరు వస్తుండటంతో పాటు భారీ వర్షాలకు ఎగువ ప్రాంతమైన కర్ణాటకు నుంచి వరద రావడంతో వాగులోకి నీరు చేరి చిన్న వాగు నిరంతరం పారుతోంది. దీంతో మండలంలోని తళంకేరి – నేరడగం దొడ్డి గ్రామాల రాకపోకలక ఆటంకం ఏర్పడుతోంది. అత్యవసర సమయల్లో, విద్యార్థులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.



నీటి ప్రవాహంలో వాగు దాటుతున్న రైతులు

నిలిచిపోతున్న రాకపోకలు..

లోలెవల్ వంతెన కారణంగా వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దాదాపు 12 సంవత్సరాల కావొస్తున్నా తళంకేరి – నేరడగండొడ్డి గ్రామాల ప్రజలు లో లెవల్ బ్రిడ్జితో సమమతమవుతున్నారు. తళంకేరి గ్రామం నుంచి ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారుతున్న నీటిలోనే వెళ్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. పుస్తకాలు నీటిలో పడిన సంఘటనలు ఉన్నాయని విద్యార్థులు వాపోయారు.

రైతల అవస్థలు..

తళంకేరికి చెందిన పలువురు రైతుల పంటపొలాలు వాగుకు అవతలి పక్కన ఉన్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతినిత్యం వాగులో నుంచి వెళ్లక తప్పదు. వాగుప్రవాహం అధికంగా ఉన్నప్పుడు పంట పొలాల పనులను వాయిదా వేసుకోక తప్పడం లేదు. నీరు తక్కువగా ప్రవహించినప్పుడే వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు ఈ వంతెన విషయమై ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించి ప్రజల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

చుట్టూ తిరిగి వెళ్తున్నాం..



సుమారు 50 మంది రైతుల పొలాలు వాగుకు అవతలి వైపు ఉన్నాయి. వాగు ప్రవాహం అధికంగా ఉన్న రోజుల్లో పదిహేను కిలో మీటర్ల చుట్టూ తిరిగి వెళ్తున్నాం. సంబంధిత అధికారులు కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– రాజు, తళంకేరి, గ్రామస్తుడు

వాహనాలు రావడం లేదు..



వాగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు తళంకేరి మీదుగా నెరడగం దొడ్డి గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించి దూరభారం తగ్గించాలి.

– రామస్వామి, సర్పంచ్, తళంకేరి

ప్రతిపాదనలు పంపించాం..



తళంకేరి– నెరడగండొడ్డి గ్రామాల ప్రజలు వంతెనతో ఎదరవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు వివరించాం. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు అవసరం ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– విలోక్, పీఆర్ ఏఈ, మాగనూర్

ఎస్సీ జాబితాలో చేర్చాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కురువ సంఘం నాయకులు

మరికల్: మాదాసి, మాదారి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న మల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే మాదాసి కురువుల సభకు సంబంధించి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో చేర్చాలని దశాబ్దం పైగా పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు రాములు, తిరుపతయ్య, అశోక్, ఆనంద్, శ్రీను, మల్లేష్, మల్లయ్య, సుదర్శన్, జగదీశ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్ష ఆదివారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు దీక్షలో కూర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు ఓంప్రకాష్ హాజరై మాట్లాడారు. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, యాబన్న, నర్సింహులు, పెంటయ్య, భీమన్న, కెంచె శ్రీనివాసులు, రాము, కాశీనాథ్, బలరాం, యాదగిరి, సౌజన్య, నర్సింహులు పాల్గొన్నారు.

అక్రమంగా కర్ణాటక డీజిల్ విక్రయాలు

- తెలంగాణ ఆదాయానికి భారీగా గండి

మాగనూర్: కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్ కొనుగోలు చేసి అక్రమంగా తెలంగాణలో విక్రయిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో దాదాపుగా లీటరుకు రూ. 12ల వరకు తక్కువగా ఉండటంతో ఇదే అదునుగా భావించి కర్ణాటక రాష్ట్ర పెట్రోల్‌బంక్ యాజమాన్యం భారీగా సొమ్ము చేసుకుంటున్నాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి మన రాష్ట్రంలోకి ట్యాంకర్‌లు, డ్రమ్‌లలో నిత్యం డిజిల్ వస్తున్న నియంత్రించాల్సిన చెక్‌పోస్టు, సివిల్ సప్లయ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై సంబంధిత పౌరసరఫరాలశాఖ అధికారి శివకుమార్‌ను వివరణ కోరగా.. ఇదివరకే సమాచారం అందిందని చెక్‌పోస్టల వద్ద ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



మాగనూర్ సమీపంలోని ఓ వ్యాపార సముదాయంలో కర్ణాటక డీజిల్ ట్యాంకర్

సరస్వతి శిశుమందిర్‌గా శ్రీవాణి స్కూల్



కోస్గి: పట్టణంలోని శ్రీవాణి స్కూల్ సరస్వతి శిశు మందిర్‌తో అనుసంధానం కావడంతో ఆదివారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు భారతమాత చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బుగ్గప్ప, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురం, నాగసానిపల్లి, నాగరాల, సేరుపల్లిలో పిరమిడ్ సంస్థ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయులు ఆదివారం ధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు కొంత సమయం ధ్యానానికి కేటాయించాలన్నారు. ధ్యానం చేయడం వలన శరీరంలో ఉన్న ఎలాంటి వ్యాధులైన తగ్గి, భవిష్యత్‌లో తిరిగి రావన్నారు. బీపీ, షుగర్ వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కృష్ణ, శోభిత, సుజాత, రాములు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో అలమటించిన చిన్నారులు



వాగ్వివాదం చేసుకుంటున్న జిల్లా అధికారి, సూపరింటెండెంట్

- కనీసం నీటి సౌకర్యం కల్పించని అధికారులు

నారాయణపేట రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని శీలాగార్డెన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి గంటలకు ప్రదర్శనలు ఉంటాయని జిల్లా అధికారులు సూచించడంలో కళాకారులు, చిన్నారులు సకాలంలో చేరుకున్నారు. అధికారులు కనీసం తాగునీరు సౌకర్యం కల్పించకపోవడంతో కళాకారులు, చిన్నారులతో పాటు తల్లిదండ్రులు తల్లిడిల్లిపోయారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం అరకొరగా వెజ్‌పప్స్ తీసుకొచ్చి పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కళాకారులు, చిన్నారులు ప్రదర్శనలు ప్రదర్శించారు. సర్టిఫికెట్ల పంపిణీలో కూడా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒకరికి ఇవ్వాల్సిన మరొకరికి ఇవ్వడంతో చిన్నారులు అయోమయంలో పడ్డారు. కార్యక్రమ నిర్వహణ విషయంలో జిల్లా అధికారి వేణుగోపాల్, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి సమన్వయలోపం కనిపించింది. అందరి ముందే వేదికపై తిట్ల పురాణం అందుకున్నారు. ఇద్దరి మధ్య మొదటి నుంచి ఆధిపత్య ధోరణి ఉందని దీంతో వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో..



అమరచింతలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా తీరని కోతలు

అమరచింత: మున్సిపాలిటీలో విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయి. ప్రైవేట్ వ్యక్తుల చేతిలో విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉండటంతో ఎప్పుడు పడితే అప్పుడు ఎల్‌సీలు తీసుకోవడం, గంటల తరబడి సరఫరా నిలిపివేయడం పరిపాటిగా మారింది. సమాచారం ఎవరిని అడగాలో అర్థం కాలేని స్థితిలో వినియోగదారులు ఉన్నారు. పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన విద్యుత్ కష్టాలు మాత్రం తప్పడం లేదు. ప్రభుత్వం రైతులకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న ఇక్కడ మాత్రం రైతులకే కాదు, గృహ వినియోగదారులకు సైతం రోజులో 18 గంటల విద్యుత్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. పట్టణానికి ఆరేళ్ల కిందట 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కావడంతో ఇక పట్టణంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరుతాయని ప్రజలు సంబరపడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గతంలో అమరచింతలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నప్పుడు సబ్ స్టేషన్ పరిధిలోని మస్తీపురం, నందిమళ్ల, పస్పుల, ఉంద్యాల, మిట్టనందిమళ్ల ఫీడర్ చానల్‌లకు నిరంతరం విద్యుత్‌ను అందించేవారు. అప్పుడప్పుడు ఆయా గ్రామాల్లో సమస్య వస్తే తప్పా సరఫరా నిలిపేవారు కాదు. ప్రస్తుతం గాలివీచినా, వర్షం వచ్చిన వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు.

కాలం చెల్లిన విద్యుత్ తీగలు..

పట్టణంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా ప్రజలకు కరెంట్ కష్టాలు మాత్రం తీరడంలేదు. పట్టణమంతా సింగల్‌ఫేజ్ తీగలు అమర్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన అధికారులు, పట్టణంలోని కాలం చెల్లిన విద్యుత్ తీగలను స్తంభాలకు మార్చలేకపోతున్నారు. దీంతో ఎప్పుడు స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు తెగిపడతాయో అన్న ఆందోళనలో పట్టణ ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత విద్యుత్ తీగలను పట్టణంలో తొలగించి నిరంతరంగా విద్యుత్ సరఫరా అయ్యే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



మాగనూరు సమీపంలో కలప తరలిస్తున్న ట్రాక్టర్

మాగనూర్: అడవుల శాతం పెంచేందుకు ప్రభుత్వం మొక్కలు నాటేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటే మరోపక్క అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. చెట్లను నరికి వేయాలంటే అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని నిబంధన ఉంది. కాని ఇవేవి పట్టించుకోకుండా అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరించి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లతో పాటు వ్యవసాయ క్షేత్రాలతో ఉన్న వృక్షాలను నరికి ఇతర ప్రాంతాలకు తరలించి అక్రమంగా సంపాదిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కలప రవాణా జరుగుతోందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరకకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగం, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువులను సన్మానించారు.

మృతి చెందిన మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం..

పూర్వ విద్యార్థుల్లో బాల్‌రాజ్, నాగరాజ్‌లు మృతి చెందారు. దీంతో తోటి మిత్రులు బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష అందజేశారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ముదిరాజ్‌లకు చేయూతనివ్వడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ బొంబాయి విజయ్

మాగనూర్(మక్తల్): ముదిరాజ్‌లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని తెలంగాణ ముదిరాజ్ యువసేన నారాయణపేట జిల్లా ఇన్‌చార్జ్ బొంబాయి విజయ్ అన్నారు. ఆదివారం స్థానిక ఐబీలో ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులస్తులలోని కులవృత్తుల వారికి మాత్రమే రూ.లక్ష ఆర్థికసాయం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీసీ కులస్తులలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటుందోనని ఆరోపించారు. ముదిరాజ్‌లకు రూ. పదివేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికలో జనాభా ప్రతిపాదికన ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏలిగెండ్ల వెంకటేష్, దండు అశోక్, నాగేష్, రాజు, నర్సిములు, గంపరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కెంచి నారాయణ

నారాయణపేట టౌన్: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ, మండల కార్యదర్శి నర్సిములు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఆదివారం తెలంగాణ ప్రజా ఆకాంక్షల దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలకు పక్క దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించకుండా కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగేందర్, మనోహర్, నర్సింహులు, తిర్మల్ శ్రీనివాస్, హన్మంతు, లలిత, తులసి, కాశీనాథ్, ఆడెం మాణిక్యమ్మ, నర్సమ్మ, భూదేవి, పద్మ, యశోద, సత్యమ్మ, రాము, దత్తు, రామలక్ష్మి, ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ప్రగతివంతమైన పాలన

- ఆయుష్మాన్ భారత్‌ను సీఎం కేసీఆర్ అడ్డుకున్నారు
- నాగర్‌కర్నూల్‌లో కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

సాక్షి, నాగర్‌కర్నూల్: గత పాలకులు ఏడు దశాబ్దాలుగా చేయలేని ఎన్నో పనులను తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా ఆయన రెండు రోజుల పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటనకు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన మీడియాకు వివరించారు. అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్ఫూర్తితో తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రగతివంతమైన పాలన సాగించిందన్నారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యాన్ని సీఎం కేసీఆర్ తన అహంకారంతో అడ్డుకుని తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచ నాయకుడిగా అవతరించారని, ఇతర దేశాలన్నీ ఆయన పాలనను కీర్తిస్తున్నాయన్నారు. ఒక్క పైసా అవినీతి లేకుండా బడ్జెట్లో కేటాయించిన ప్రతిపైసాను పేదలకు పంచుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రం వంటి భారీ కుంభకోణాలు లేవన్నారు. దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న గత పాలకుల కన్నా ఎన్నో అంశాలను తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలోనే సాధించిందని చెప్పారు. జిల్లాలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు చేపట్టిన 167కె జాతీయ రహదారితోపాటు సోమశిల– సిద్ధేశ్వరం వద్ద దేశంలోనే అతిపెద్ద డ్యాం వంతెన నిర్మాణాన్ని కేవలం రెండేళ్లలోనే పూర్తిచేయనున్నట్లు వివరించారు. ఇక్కడి ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపరుస్తామని చెప్పారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో 53,868 కి.మీ., జాతీయ రహదారులను నిర్మించామన్నారు. 15 ఎయిమ్స్ సంస్థలు, 700 మెడికల్ కళాశాలలు, కొత్తగా 69 వేల మెడికల్ సీట్లను పెంచామన్నారు.

అభివృద్ధిలో మా భాగస్వామ్యం..

కొల్లాపూర్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంది.. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత బీజేపీ శ్రేణులదేనని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. ఆదివారం ఉదయం సోమశిలలోని లలితాంబికా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీపంలోని కృష్ణానదిలో పడవలో ప్రయాణించారు. 167కె జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. మల్లేశ్వరం శివారు నుంచి సంగమేశ్వరం వరకు బ్రిడ్జి నిర్మించబోయే ఏరియాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, నేషనల్ హైవే డీఈ అశోక్‌రెడ్డి చూపించారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు. భారత్‌మాల పథకంలో భాగంగా నేషనల్ హైవే, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారి, బ్రిడ్జి నిర్మాణ సాధనకు సుధాకర్‌రావు, ఆచారి ఎంతో కృషిచేశారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, అనువైన స్థలాలుంటే పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీజేపీ గతం కంటే ఈసారి మెరుగ్గా ఉందని, పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, నాయకులు రాజవర్ధన్, సుబ్బారెడ్డి, దిలీప్‌చారి, శేఖర్‌గౌడ్, రోజారమణి, కృష్ణ, బుడ్డన్న, నారాయణ, సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానది తీర ప్రాంతంలో పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే తదితరులు